
# వరదపోటు



## అట్టాడ అప్పల్నాయుడు

కథ

మబ్బుల కూంబింగ్‌తో, చాటుకు పోయిన పొద్దు! నది ఒడ్డుకు దగ్గరలో లంగరేసిన పడవలా- ఊరికి కేక దూరంలో పాఠశాల! పొద్దు నడినెత్తికి నాలుగడుగులు దూరంలో వున్న వేళ, అయినా వెలుగు శూన్యం.

పాఠశాల వరండాలో, కర్రకుర్చీలో కూర్చొని- దృష్టి సాగినంతమేర రోడ్డు మీదకు చూసి, దీర్ఘ నిట్టూర్పు తీసి, 'ప్చ్'... అని శబ్దం వొదిలేరు చంద్రరావు మాస్టారు. ఆ శబ్దాన్నీ, నిట్టూర్పునీ, మేస్టార్నీ గమనించిన కానిస్టేబుల్ అప్పల్రాజు-

"... యేటీ అలికిడి అవటంలేదా మేస్టారూ?" అని ప్రశ్నించేడు. ఆయన వరండాకి ఆనించిన గది ద్వారం వద్ద, వో స్టూలు మీద కావలాగా కూర్చున్నాడు.

"...యీ యాల్టికిక- పొద్దూ అలికిడి కాదు, ఎలక్షన్ల ఒనరు అంపుతానన్న వోహనమూ అలికిడి కాదు. కాదు గాక కాదు. యేటీ అలికిడి కాదు..." మాస్టారికి కాస్త యెడంగా, మెట్ల మీద కూర్చొని, చేతిలోని బాణాకర్ర మొదలుతో- పొద్దుట్నించీ తడిసిముద్ద అవుతోన్న నేలమీద పొడుస్తూ, వాటి అచ్చులను చూస్తూ, భవిష్యత్ చెప్పేడు తలయారీ.

పొద్దుట్నించీ సన్నగా కురిసిన చినుకులు, మధ్యాహ్నం వేళకి ధార గట్టి కురిసేయి- కూంబింగ్‌లో పేలిన తూటాల్లా. మళ్లీ యిపుడు కాస్త నెమ్మదించేయి, గానీ, మళ్లీ విజృంభించటానికి శక్తికోసం విరామం తీసుకున్నట్టున్నాయి!

తలయారీ భవిష్యవాణితో, మాస్టారికి మరింత భయం పట్టుకుంది. మాస్టారికెపుడూ భవిష్యత్ భయపెట్టేదిగానే వుంటుంది. కానిస్టేబుల్ అప్పల్రాజు మాత్రం- అనుమానంగా తలయారీవేపు చూపు విసిరి-

"... యీ తొత్తుకొడుక్కి పొద్దుపొడుపూ, పోలింగ్ వాహనమూ రాకపోతేనే సంబరం లాగుంది. ఈ ముసురు వానా, యీ దిక్కుమాలిన కాపలా, ఊరవతల వల్లకాడులా యీ స్కూలూ- యిక్కడ, మీారు ఇబ్బందిపడితే, యీడికి సంబరమెందుకో?పొద్దుట పోలింగు యేర్పాట్ల నించీ సూస్తన్నాను- అన్నీటికీ యెటకారంవే నంజికొడుక్కి.

పొద్దుపొడకపోతే, పోనీ! గానీ పోలింగు వాహనం రాకపోతే...?! హమ్మో! వొక్కడ్నే వోట్ల పెట్టెల్ని కాపుగాయాలా? ఏ మావోయిస్టు మారాజో... ఆడిదాకా యెందుకు, యే అపోజిసన్ పార్టీవోడో, ఆడు మాత్రమేనేటి, అధికార పార్టీ నంజికొడుకో- యెవుడో వొకడు, ఆడి ముఠాతోటి వొచ్చీసి మీదబడిపోతేనో...?! ఓట్ల పెట్టె అనేసరికి- పెతీ నంజికొడుక్కి లోకువే, మనకి దప్పా!

ఔనూ, మనకి మాత్రమెందుకా పెట్టెమీద గౌరువం? అది పాంవుల పెట్టె. అందలోంచి పడగలిప్పుకొని పాంవులే వొస్తాయి.

ఔనూ, పాంవులు పొడిస్తే వొయికుంఠం కెల్తారని, యే నంజికొడుకు అన్నాడో గానీ ఆడికి వైకుంఠమూ "తెల్దు, పాంవుకాటూ తెల్దన్న మాట..."యిలా మనసులో అందర్నీ నిందించుకుంటూ, కూచున్నాడు.

"...ఎమ్పీటీసీ ఎలక్షన్లకి శీకారం సుట్టింది వోన. పంచాయితీ ఎలక్షన్‌కి పస దీస్తంది. అపుడూ, యిలగే, తొలీత మబ్బులు, తరాత ఉరుములు, ఆ తరాత వోనా! వోన పెరిగి వొరద! వొరదకి యేటికి గండ్లూ...ఊళ్లు ముంపూ...!ఇపుడూ, అంతే. వోనా, వొరదా, గండ్లూ, ముంపూ ఖాయం..." అని, బాణాకర్రతో నేలమీద అచ్చులు పొడుస్తూ మళ్లీ భవిష్యవాణి విన్పించేడు తలయారీ.

వోన- మళ్లీ జోరు పెంచింది. పెనుగాలికి, పాఠశాల మైదానంలోని, అలనాడు జన్మభూమికి పెంచిన నాలుగు తురాయిచెట్లు, వాన నీటిని దులుపుకొని, వర్షానికి నిరసనగా కొమ్మల్ని ఊపసాగేయి. తురాయిచెట్ల మొదళ్ల చుట్టూరా మట్టి వర్షపునీటికి కరిగి, బురదగా జారుతూ, వాటికి దిగువభాగంవేపు యెదిగిన క్రోటన్స్ మొక్కల చుట్టూ మడుగు కడ్తోంది. ఆ బురద మడుగులో, యెపుడు చేరాయో- రెండు బురద పాములు, యెందుకో సర్రున కదిలేయి.

"...వోయ్. పా...ప్పా... పాంవులోయ్. కొట్టు, కొట్టేవోయ్..." కానిస్టేబుల్ అప్పల్రాజు, ద్వారం దగ్గర స్టూలుమీద కూచొని, చూసి, కేక వేసి, చెప్పేడు తలయారీకి. తలయారీ, బాణాకర్రకవి అందుతాయి.

తలయారీ, వాట్ని చూసేడు. కర్రను వెనక్కి తీసుకొని, లేచి, కర్రను కుడిచంకకు దన్ను పెట్టుకు నిల్చొని-

"...యేల కొట్టాలబావ్..." అనడిగేడు.

"...పాంవులు గదవోయ్..."

"... అయితే? అవి మాత్రం జీవులు కావా? ఈ సృష్టిలోన సకల జీవరాసిలాగ- ఆట్నీ ఆ భగవొంతుడు సృష్టించలేదా? మనుసుల్ని రచ్చించడానికి- రక్షకులుగా- యేలినవోరు మీ పోలిసువోర్ని యెలాగ నియమించినారో; ఆ భగమంతుడూ ఆ జీవరాశికి రక్షకులుగా యెవుర్నో యెట్టి వుంటాడు. నాకేల- ఆళతోటి యిరోధం..." అనన్నాడు తలయారీ.

"...నువ్వే వోట్లపెట్టె కాపుగాయి. ఆ బాణాకర్ర నాకియ్యి. ఆ పాంవుల పని పట్టేస్తాను..." అని లేచేడు కానిస్టేబుల్ అప్పల్రాజు.

"...తంవరంతపాటి పనిమంతులని నాకెరికే గాని, జమానుబావో, అవి బురదపాంవులు. మీద నుండి వొచ్చీ బురద నీటికే బెదిరిపోయి- పోలీసువేను హారను సొండుకి, ధాబాలకాడ ఆడగుంటలు పారిపోయినట్టగ, సూడండెలగ పారిపోతన్నాయో" అని చూపేడు తలయారీ.

పాములు- ఆ బురదమడుగు నుంచి జరజరా ప్రాకి, మైదానం అవతలి పెండి వేపు పోయేయి.

అప్పల్రాజు జవాను, తలయారీవేపు గుర్రుగా చూసి, తర్వాత, గది లోపలి ఓట్లపెట్టెవేపు చూసేడు. మబ్బుగమ్మిన ఆ చిరువెలుగులో, గది లోని- ఓట్ల పెట్టె- నల్లగా పాములపుట్టలా కన్పించింది. చూపు మరల్చుకున్నాడు.

"... అదా, అదే! వొచ్చేస్తంది...అదే..." కేకేసాడు తలయారీ.

రిలీఫ్‌గా... రోడ్డు వేపు చూసేరు మేస్టారు. రోడ్డువేపు కాదు, వెనక వైపు, పొలాలవైపూ కాలువవైపూ చూడమని సైగ చేసాడు తలయారీ. మాస్టారికర్థం కాలేదు. అప్పల్రాజు జమాను- ద్వారం నించి, గది వెనుక కిటికీలోంచి చూసేడు. కురుస్తోన్న వర్షం, పచ్చనిచెట్లూ, పొలాలూ, సమస్తంవూ తడుస్తూ...తడుస్తూ...

"...ఆట్ని చూడండి, ఆ పిట్టా, పిచ్చుకా, పచ్చుల్ని చూడండి- యెలగ రెక్కలు గొట్టుకొని, యెగిరిపోతన్నాయో... ఆకాశంల సూడండి...! వొచ్చేస్తంది..."

ఈసారి, ఆకాశం వైపు చూడమన్నాడు తలయారీ.

అప్పల్రాజు జవానుకి, గదిలోంచి ఆకాశం కనబడలేదు. చంద్రరావు మాస్టారు, చిరాగ్గా- యేఁవొచ్చేస్తోందని ప్రశ్నించేరు.

"...వొరద! వొరదండీ మేస్ట్రుగోరో. వొచ్చేస్తంది..." ఈసారి భవిష్య వాణి కాదు, వర్తమాన వాణే విన్పించేడు తలయారీ.

"హమ్మో...వొరదే..."

"...నాయినా...వొరదే..."


"హయితే, యిపుడేం చెయ్యటం?"

"...దేనికి? యేది సెయ్యిడిం?"

"...వరద వస్తే..."

"...మనమేటీ సెయ్యిం మేస్ట్రుగోరూ. గవర్నమెంటే యేటైనా సెయ్యాల. ఇంటికి, ఫుల్ డేమేజీకి వెయ్యా, పార్టు డేమేజీకి అయి దొందలూ, పాతిక్కేజీలు రైసూ, పది లీటర్ల కిరసనాయిలూ, కొత్త బట్టలూ- అవీ, యివీ, యేవేవో గవర్నమెంటే యివ్వాలా, ఇస్తాదీ. నెలకిందట వొరదొస్తే... యిచ్చింది గాదేటి? ఆటికోసం, ఊరిల గొడవ లవలేదా? అపోజిసనోళి యిళ్ల లిస్టు తప్పించీసేరని, వరద సుక్క గూడా యింటికి రాకపోయినా, అధికారపార్టీ వోళ్ల యిళ్ల లిస్టునే శాంక్సన్ జేసారని గొడవ...గొడవ!"అని, తలయారీ నెలకిందటి వరద ముంపూ, సహాయ కార్యక్రమాల్లో అవకతవకల్ని, గొడవల్ని, తనదైన శైలిలో విన్పించి, వరదముంపుకు- యిల్లూ, పొల్లూ, పొలాలే గాక, కాలువలూ, రోడ్లూ, కరకట్టెలూ కొట్టుకుపోతాయనీ, కాలువలూ, రోడ్లూ, కరకట్టలు పోయినందుకు- తత్సంబంధిత అధికార్లూ, కాంట్రాక్టర్లూ, యెంతో సంతోషిస్తారనీ, మళ్లీ మళ్లీ కొట్టుకుపోయే వరదకోసం- తిరపతి మొదలుకొని తిలోరుదగ్గిటి కొత్తమ్మతల్లిదాకా, మొక్కులు మొక్కుతారనీ; కాంట్రాక్టు పనుల ఆమోదం, నిధులజారీ... త్వరితంగా జరగకపోతే ప్రజాసమూహాల్తో ఆందోళనలూ లేవనెత్తుతారనీ, బాగా యెరిగిన కార్యక్రమ చరిత్రను చెప్పినట్లు చెప్పుకొచ్చేడు తలయారీ. శ్రోతలిద్దరూ... మౌనంగా విన్నారు. ఆ తర్వాత-

"...ఔను మేస్ట్రుగోరూ, మీకెప్పుడు వొరదా, వొరద సాయఁవూ... రాలేదా?" అనడిగేడు తలయారీ.



మాస్టారు- తల అడ్డంగా, రాలేదనట్టు ఊపి; యీ వానలేఁవిటి? ఈ కాలువలూ, ఆనకట్టలేఁవిటి? కనుచూపుమేరా యీ పచ్చని పొలాలేఁవిటి? యీ వరదముంపులేఁవిటి? తన ప్రాంతంలో- నీరింకిన చెరువులూ, బావులూ; నీటి మొహం యెరుగని మెట్ట భూఁవులూ, ఆకాశం వేపు చూసే అర్ధనగ్న రైతులూ! వంశధార, నాగావలి, జంఝావతి, తదాది నదుల నీళ్లు-యిలా- పొంగి పొర్లీ, యీ ఊళ్లను ముంచి, సముద్రంలో వృధాగా కలువటంగాక- మా ప్రాంతానికి ప్రవహిస్తేనో...! అందుకు సరిపడా ఇంజినీరింగ్ విజ్ఞానం లేదా? పాలకుల సంకల్పం లేదా? ఏఁవిటి దంతా...?

ప్రశ్నలెన్నో మాస్టారి మనసులో ముసురుకోగా, సమాధానాలు ఆలోచించే సాహసంలేక, వో దీర్ఘ నిట్టూర్పు తీసి-

"...ఓసారి, రోడ్డు మీద జంక్షన్ వరకూ వెళ్లి చూసిరాగూడదూ, వాహనాలేమేనా తిరుగుతున్నాయో, లేదో. పోలింగ్ ముగిసి చాలాసేపైంది. ఏం చేయటమో... పాలుబోవటం లేదు. ఓసారి, చూసిరా..." అని బతిమాలేరు తలయారీని.

అదో చిన్న గ్రామం. పంచాయితీకి మధురా గ్రామం. పెద్ద గ్రామంలో- పెద్ద పెద్ద రైతులూ, చిన్న చిన్న రైతులూ, వ్యాపార్లూ, రాజకీయ నాయకులూ, ఉద్యోగులూ వుండగా యీ గ్రామంలో, కూలీలు, దళితులూ, అగ్రహారపు బ్రాహ్మలు రెండు కుటుంబాలూ వున్నాయి. రెంటి మధ్యా ఆదిలో- సఖ్యత వుండేది. కూలినాలీ దగ్గర, పండుగా పబ్బాలు దగ్గర, ఆరంభమయి- రాజకీయాల దగ్గర వైరం ముదిరింది. ఆదిలో బ్రాహ్మలూ, ఆ తర్వాత పేదలూ, యిపుడు దళితులూ యీ గ్రామానికి నాయకత్వం. మాకు, పంచాయితీ- వేరు పరచాలన్నారు. అందుకు పంచాయితీ చట్టం వొప్పుకోదనీ; కుల రిజర్వేషన్ రొటేషన్ పద్ధతిలో మీ గ్రామ వాసులకీ సర్పంచ్ పదవి అవకాశం కల్పిస్తామన్నారు అధికార్లూ, నాయకులూ. ఓసారి అలా, ఓ.సి.కి కేటాయించగా బ్రాహ్మలకు సర్పంచ్ పదవోసారి వొచ్చింది. పేదలకేనాడూ- రాలేదని, పేదలు ఎన్నికల బహిష్కరణ రాజకీయాల్లోకెళ్లగా, ఈసారి దళితులకు రిజర్వు కాబోతే- మాయజేసి బి.సి.లకు మార్పు చేయించారట పెద్ద గ్రామ పెద్దలు. దాంతో దళితులు, పేదలతో కలిసి- ఎన్నికల బహిష్కరణన్నారు.

కలెక్టర్‌గారు కల్పించుకొని కొన్ని సంక్షేమపథకాలు వాగ్దానం చేసినా, ససేమిరా అన్నదట ఆ చిన్న గ్రామం. చివరికి, స్థానిక నాయకులూ, ఎమ్మెల్యేగారూ రంగంలోకి దిగి, రాజీ చేయగా- సరే, యిదే ఆఖరు, యిక ముందీ ఊరికి ప్రత్యేక పంచాయితీ యిచ్చితీరాలి. ఇప్పటికి, యిక్కడ వొక పోలింగ్ బూత్ పెట్టాలన్నారట. పెద్ద ఊరెళ్లి ఓట్లు వెయ్యమన్నారట, యీ ఊరివాళ్లు!

అదిగో, అలా యిక్కడ పోలింగ్ బూత్-పెట్టాల్సి వచ్చింది. ముందు రోజు సాయంత్రం- ఊరిలో దిగిన సిబ్బంది, యిక్కడ యే సౌకర్యమూ లేదని, సౌకర్యాలందించే పెద్ద గ్రామానికి వెళిపోయి, తెల్లవారేక వొచ్చేరు. చంద్రరావు మాస్టార్ తలయారీ- బూత్ యేర్పాటు చేయటం, సరంజామా సర్దుకోటం చేసారు. తోడుగా, అప్పల్రాజు కానిస్టేబులూ!

వేకువజామున చిన్నగా చినుకులు రాలినా, పోలింగువేళకి ఆగేయి. పోలింగ్ బాగానే జరిగింది. మళ్లీ వాన గూడా... అలాగే! తడిసి ముద్దయిన ఓటర్లు. గడువు ముగిసి, సరంజామా సర్దేయగా, ఏజెంట్లు యెవరిళ్లకు వారు భోజనాలకు పోయేరు. ఎన్నికల సిబ్బంది- మళ్లీ పెద్ద గ్రామానికి పోయేరు, యీ ముగ్గుర్నీ వొదిలేసి; వాహనంతో తిరిగి వస్తామని! ఎప్పటికీ వాహనం... రాదు... వాన తగ్గదు...!

"... యీ పూటకిక ఉపోసఁవే..." అనన్నాడు తలయారీ, రోడ్డుకెళ్లి, తిరిగివొస్తూ.


"... ఊర్లోంచి భోజనాలొస్తన్నాయో లేదో చూడమన్నారా? పెద్ద ఊరి నుంచి వాహన మొస్తందో, లేదో చూడమన్నారా, నీకు?" కసురుకున్నట్టు అడిగేడు అప్పల్రాజు.

తలయారీ, నిర్లిప్తంగా ఆయనవేపో చూపు విసిరి, తలపాగా విప్పి, దులిపి, బుర్ర గోక్కొని-

"... మేస్ట్రుగోరో, యేటి జేస్తాం? వొరదొచ్చిన యిరవయి నాలుగ్గంటలకుగాని- యెలికాప్టర్లెగరవు. పులిహోర పొట్లాల్ని, వాటర్ పేకెట్లనీ యిసరవు. యేటిసేస్తాం?" అనన్నాడు.

కానిస్టేబుల్‌కి మండిపోయింది, యిక ఆపుకోలేక-

"...ఔనొరే, తలార్నా కొడకా! ఈ వోనేటి, యీ



వరదేటి యీ జాగారమేటి? వాహనం రాలేదు. బేలట్ బాక్స్ బండిపోనాయి. అవతల ఎలక్షనాఫీసర్ నుండి యే ఆర్డరూ రాలేదు, ఉండలేము, వెళ్లలేము! ఏంజెయ్యిడింరా దేముడా అని, ఆ మాస్టారు గుండా పిండి అవుతుంటే, తిండిగురించి మాటాడ్తావురా? పులిహోరా పొట్లాలా కావాలి? నిన్నటినుంచీ చూస్తన్నాను- అన్నిటికీ యెటకారమే నీకు. వరద వొస్తే సంబరం, పాఁవులొస్తే సంతోషం, మబ్బు గమ్మితే... మజా...! ఏట్రా నీ పోత్రం? ఆఁ!

ఒరే, యీరోజు గడవనీ, యేదోరోజు నిన్ను మా స్టేషను లాకప్పుల, పాఁవులు పెట్టె పక్కనపెట్టి, పదిరోజులు తిండీ తిప్పలు గాదు, నీళ్ల సుక్కలివ్వకుండా, రిమాండ్ చెయ్యకపోతే- వొరే, నా పేరు నంబాళ్ల ప్పుల్రాజు జెవానే కాదు... ఆఁ!" అని, పోలీసు శపథం చేసాడు.

తలయారీ చెంపలు వాయించుకున్నాడు. చేతులు జోడించి దండం పెట్టేడు. తర్వాత జవాను పాదాలవద్ద కూచొని, పాదాలు బూట్లలోపలుండిపోవటంతో, బూట్లనే అరచేతుల్తో పాముతూ-

"... బావ్, బావ్...బావూ. అంత ఆగ్రయించకండి. సెమించండి, సీమలాటోడ్ని- తఁవరికి నీనేమాత్రం. తమ సూపు సాల్ను... మసి అయిపోతాను. తఁవరు తలుసుకుంటే- నాకు నీలూ, పాలేటి బావూ- మాన పేనాలే దక్కవు. పులి ఫవర్సు తఁవరివి. పులి మీసాల్తోటి ఉయ్యాలూగి- ఉదిమి మీద బతగ్గలనా? అమ్మో...!

కొట్టేయండి బావ్, కొట్టేసి కోపం సల్లార్సుకోండి. ఇదిగో బూటుకాలితోటి తన్నేయండి. వదిగా లాఠీకర్రతోటి బాదీయండి. ఇంతటితోటి మీ కోపం సల్లారిపోవాల! పగ మిగిలిపోతే... నాకు నిత్యగండం! నాయినో, పోలేరమ్మ తల్లి పగా, పోలీసోరి పగా... సిన్న సిన్న ఆపదలు తేవు! అమ్మో! కొట్టీయండి బావూ, కోపం సల్లార్సుకోండి బావూ..." అని వేడుకోసాగేడు.

ఆ వేడుకోలులోను వ్యంగ్యమే ధ్వనిస్తోందన్పించినా, బూటుకాలు గానీ, లాఠీకర్రగానీ వినియోగించలేదు జవాను.

అంతలో అప్పటిదాకా మౌనం దాల్చిన చంద్రరావు మాస్టారి జేబులోని సెల్‌ఫోన్ మోగింది. ఎన్నికల అధికారి ఫోన్. చాలా సేపట్నించీ చేస్తోంటే, అవుటాఫ్ కవరేజ్ యేరియా అనొస్తోంది- యెక్కడికెళ్లేవూ- అనడుగుతున్నారు.

చంద్రరావు మాస్టారు- చుట్టూ చూసేరు. ఎటు చూసినా- జలభూతమేదో కెరటాలు వేసుకు ధూళివర్ణంలో యెగసిపడ్తూ కన్పిస్తోంది. పొలాలూ, కాలువలూ కలిసిపోయేయి. స్కూలు ఆవరణలో, క్షణం క్రితందాకా కన్పించిన భూతులసి మొక్కలూ, క్రోటన్సూ, వాటి కొమ్మారెమ్మల్లో తిరుగాడే క్రిమి కీటకాలు; బురదమట్టిలో వుండే బురద పాములు- యేవీ కన్పించడం లేదు. అంతా జలమయం!

"...ఎక్కడికెళ్లగలను సార్. కవరేజి యేరియాలోనే వున్నాను. నేను కవర్ గావటం లేదు. ఫ్చ్..." అని జవాబు చెప్పాలను కొని, చెప్పలేక- సిగ్నల్స్‌లేవు సార్ సెల్‌కి, యిప్పటిదాకా- అని బదులిచ్చేరు మాస్టారు.

"... మరి యెలా...?" అనడిగేరు ఎన్నికల అధికారి.

ఏమిటి, యెలానో- అర్థంగాక, యీసారి సెల్‌వేపు చూసేరు అయోమయంగా మాస్టారు.

వరద వొస్తోందా? మీరున్న పాఠశాలలోకి నీళ్లు చేరాయా? బేలెట్ బాక్స్‌లు భద్రపరిచారా? సిబ్బంది అంతా వున్నారా? నదికి వంతెన దగ్గర నీరు- ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తోందట తెల్సా? నది దిగువ ఊళ్లన్నీ- ముంపుకి గురయ్యేయట తెల్సా?

వగైరా ప్రమాద సమాచార ప్రశ్నలు వేసి- మౌనం వహించింది సెల్.

మాస్టారు, హలో,హలో అన్నారు. భయంతో గుండెలు వేగంగా కొట్టుకోసాగేయి. అంత చల్లటి వాతావరణంలోను- చెమటలు పట్టేయి. సెల్‌లోంచి- ఎన్నికల అధికారికి, రింగ్ చేసారు. కాసేపు సెల్- చుక్కల్ని చూపి, మీరు కాల్ చేస్తోన్న నంబర్ కవరేజి యేరియాలో లేదని, ఆంగ్లంలో గూడ తర్జుమాచేసి చెప్పసాగింది. కాల్ చేసి, చేసి, యిక యేమీ పాలుపోక, దిగాలుగా కూచున్నారు మాస్టారు.

ఎవరు మాస్టారూ పోన్- అనడిగిన కానిస్టేబుల్‌కి, విషయమంతా చెప్పేరు. మరి, మన సంగతేంటి? ఏం చెయ్యాలి? అనడిగిన కానిస్టేబుల్‌కి- చేతులు జోడించి ఆకాశంవేపు చూపించి నిట్టూర్చేరు మాస్టారు.

ఎప్పుడొచ్చిందో, ఊర్లోంచి నెయ్యిలముసల్ది- నెత్తిమీద మూటతో వొచ్చి, వీర్ని క్షణకాలం చూసి- ముంచుకెళిపోవొస్తంది వొరద- డాబా మీదకి యెళిపోతెగాని- పేనాలు దక్కవు- అని చెప్పి, గబ, గబా మెట్లెక్కసాగింది.

"...బావూ- నెయ్యిల ముసిల్ది దోవదీసిందంతే, యిక ఊరు ఊరంతా వొచ్చీస్తన్నట్టే. పదండి, మనమూ డాబా యెక్కేద్దం..." అనన్నాడు తలయారీ.

"... ముందు, బేలట్‌బాక్స్ భద్రంగా డాబామీదకు తీసుకెళ్లాలి..." చెప్పేరు మాస్టారు. గదిలోపల- బేలట్‌బాక్స్ ముడ్‌వేసిన యినుప పాములా వుంది. రెండు చేతుల్తో, బేలెట్ బాక్స్‌ను యెత్తుకొని- "నారాయణ, నారాయణ..." అంటూ కదిలేడు తలయారీ. నారాయణ, న్నారాయణంటున్నావేంరా, తొత్తుకొడకా- అని కేకవేయబోయి, యిప్పుడు కాదు, యీ గండం గడవనీ, తొత్తుకొడుక్కి నాలిక కోసెస్తానని, మనసులో తీర్మానించుకొని, మౌనంగా బ్యాలట్ బాక్స్ కాపలాకు నడిచేడు కానిస్టేబుల్.

చినుకులు పడుతుండటంతో, కాగితాలు తడుస్తాయని జంకుతూ, మాస్టారు కిందనే వుండిపోయేరు. జలభూతం వరండా మెట్లను ముంచేసి, మాస్టారి పాదాలను చుట్టేసింది. ఫైలు గుండెలకదుముకొని- పైన వర్షం, క్రింద వరదతో యీ ఫైలుకి గానీ, ఆ బేలెట్ బాక్స్‌కి గానీ, నాకుగానీ- యీ ముప్పు నుండి రక్షణ వుందా- ప్రశ్న రంపపుకోతతో, గాలిలో దీపంపెట్టి-దేవుడా నీదేభారం- అన్నట్టు నిల్చున్నారు మేస్టారు.

తలయారీ అన్నట్టు- ఊరిలోంచి చిన్న, చిన్న గోనెసంచీ మూటల్తో, ముసలీ, ముతకా, పిల్లా జెల్లా, చిన్నా పెద్దా- జట్లు, జట్లుగా వస్తున్నారు. అందరూ, నీళ్లలో ముంచి తీసిన జీవుల్లా- నీళ్లోడుతున్నారు. నెత్తిమీద మూట, తడిసి బరువెక్కగా, వరండాలో కాసేపు ఆగి, నిట్టూర్చి- డాబా మీదకి పోతున్నారు.

వరదనీళ్లు- మాస్టారి ముంగాళ్లను ముంచేయి. డాబామీంచి, దిగొచ్చి తలయారీ- "మేస్టుగోరో, గదుల్లోకి నీళ్లుగాని చేరితే- మీరపుడు డాబామెట్లెక్కలేరు. నీటిల తేలిపోయి, కొట్టుకపోతారు.

(తరువాయి 38వ పేజీలో)

*మాస్టారు, హలో,హలో అన్నారు. భయంతో గుండెలు వేగంగా కొట్టు కోసాగేయి. అంత చల్లటి వాతావరణంలోను- చెమటలు పట్టేయి. సెల్ లోంచి- ఎన్నికల అధికారికి, రింగ్ చేసారు. కాసేపు సెల్- చుక్కల్ని చూపి, మీరు కాల్ చేస్తోన్న నంబర్ కవరేజి యేరియాలో లేదని, ఆంగ్లంలో గూడ తర్జుమాచేసి చెప్పసాగింది. కాల్ చేసి, చేసి, యిక యేమీ పాలుపోక, దిగాలుగా కూచున్నారు మాస్టారు.*

# వరదపాలు

(22వ పేజీ తరువాయి)

మీదకొచ్చీయండి..." అని పిలిచేడు.

"...చినుకులు... తడిసిపోతాయి కాయితాలవీ...." గొణిగేరు మేస్టారు.

"... కాయితాలేటండీ బావూ- కొంపలే మునిగిపోతంటే..." విసుక్కున్నాడు తలయారీ. నీళ్లు- మేస్టారి ముంగాళ్లను ముంచేసి, ఎగబాకుతున్నాయి. అప్పుడు ఫైలు గురించి కాదు, ప్రాణమ్మీద బెంగ కలిగి, గబ, గబా, డాబా మెట్టెక్కేరు. డాబామీద, నిండుగా జనం. కొందరు మూటల్ని ముందు పెట్టుకు గొంతు కూచుంటే, కొందరు నిల్చొని- కనుచూపు మేర వరదనీటిని చూస్తూ- వారెరిగిన, వినిన, గతకాలపు వరద బీభత్సాలను, ప్రభుత్వ సహాయచర్యల వైఫల్యాలనూ; వాటితో పాటే, యిప్పటి పంచాయితీ ఎన్నికనూ, గతకాలపు ఎన్నికలనూ, కలగలిపి, మాటాడుకుంటున్నారు.

"...అంతక ముందెపుడో మా తాతలకాలంల, పెద్దయేరు(వంశధార) కిలగే వొచ్చిందట వొరద, అలగ మళ్లా ఎనభయిల(1980) వొచ్చింది. ఊరు మొత్తం దిబ్బ యేస్సింది..."

"తొలీత, పంచాయితీ పెసిడెంట్‌కి మనూరిల పోటీయే లేదు, అల్లా పంతులుగోరు తాత రామదాసుగోరు, యేకగ్రీవంగా యెన్నికైనారు. తెల్లోడి పాలనల ఆయన జైలులో వుండేవోరు..."

"అవున్రా, పంతులుగోరేటయినారు? ఎక్కడున్నారు?"

"...అవునుగానీ, వొరదలెందుకొస్తాయిరా?"

"...ఎలక్సన్లెందుకొస్తాయిరా...?"

కొన్ని ప్రశ్నల సంభాషణ సాగుతోంది. మాస్టారు ఆశ్చర్యపోతున్నారు, ఒక విపత్తు మధ్యలో వుండి, యీ ప్రజలు, ఆ విపత్తు గురించి విలపించక, యెన్నెన్ని స్పర్శించుకుంటున్నారు? ఇది, నాకెందుకు సాధ్యం కావటంలేదు! వారికి పోయేదేమీ లేదనా? మరి నాకో? ఆ కానిస్టేబుల్‌కో?

కానిస్టేబుల్‌వైపు చూసేరు. కానిస్టేబుల్, ఓట్లపెట్టెనే చూస్తూ మనసులో... ఆ పెట్టెనీ, ఆ ఎన్నికలనీ, ఓటర్లనీ, వరదనీ, తలయారినీ... తిట్టుకుంటూ కాలం గడుపుతున్నాడు. తిట్టడం, కొట్టడం తప్పా, మరొక ఆలోచన మనకెందుకురా అప్పల్రాజో- అని తనకు తాను బోధించుకుని, కూచున్నాడులా వుంది.

అంతలో, ఆడవాళ్ల గుంపు... యేడ్పు విన్పించింది. అందరూ, అటువేపు చూసేరు. గుంపు దగ్గరకు కొందరు మగవాళ్లు వెళ్తే- గంగమ్మతల్లీ, యిదా నీకు సమయం- అనంది, పురుడుబోసే పున్నమ్మ. కిల్లాన చంద్రయ్య కోడలుకి నెప్పులొచ్చేయి. మగాల్ని దూరంగా పొమ్మంది పున్నమ్మ. చుట్టూ వున్న మూటా, ముల్లెను దూరంగా జరపమంది. తడిసిన కోకలనే, నాలుగు తీసి, చుట్టూ డేరా కట్టమని, ఆడవాళ్లను పురమాయించింది. నొప్పులు వడుతోన్న మనిషిని, ఓర్చుకోమంది. పుట్టుకకాడ, సావుకాడ బాధ తప్పదు, ఓర్చుకోవాలంది.పంటి బిగువుతో, ఆ మనిషి మౌనంగా నొప్పులు వడ్తోంది.అంతా నిశ్శబ్దం- జలభూతపు హోరు, వాన చినుకుల సవ్వడి మాత్రం...వేనవేల బాధితుల దుఃఖపు ఘోషలా విన్పిస్తోంది.

అంతలో, దబ్బున శబ్దం విన్పించింది.

"... ఓటు పెట్టె, వరదల పడిపోయిందర్రో..." కేకేసాడు తలయారీ. మొదట వెటకారమనుకున్నాడు, చూస్తే నిజంగానే బ్యాలెట్ బాక్స్ లేదు. వరదలో, పాఠశాల ఆవరణలో తేలియాడుతూ కన్పించింది, కానిస్టేబుల్‌కి.

"... ఓట్లు మునిగిపోతన్నాయర్రో..." అరిచేడు తలయారీ.

"... బతుకులే మునిగిపోనాయి, ఓట్లు మునిగితేటి నస్టంలేర్రా..."

మాస్టారు, కొట్టుకుపోతోన్న బ్యాలట్ బాక్స్ చూస్తూ; తనకు రాబోయే నష్టాల్ని తల్చుకు వణికిపోతున్నారు. కానిస్టేబుల్- యీ రక్షణ బరువంతా నా నెత్తిమీద యే నంజికొడుకు పెట్టాడ్రో-అని తిట్టుకుంటూ, లేచి మెట్లు దిగబోయేడు. అంతలో, అక్కడనించి, పున్నమ్మ భర్త వీరేశు గభాల్న నీటిలోకి దుమికి, ఈదుకుంటూ వెళ్లి, బ్యాలెట్ బాక్స్ అందుకొని, తిరిగి యీదుకుంటూ, మెట్ల దగ్గరకొచ్చేడు. మెట్లు దిగిన కానిస్టేబుల్‌కి బాక్స్ అందిస్తూ-


"... ఓటుకి యిలువ లేకపోవచ్చుగానీ, ఓట్లేసినోళ్లకి యిలువుంది. మా యిలువ మీమే కాపాడుకోవాల! అందికే, వొరద పాలు గానీకుండా తెచ్చేను" అనన్నాడు!

సరిగ్గా, అప్పుడు చినుకులు ఆగినాయి. •




## ఆనందాన్ని పంచే ఆదివారం

నేను వ్యవసాయశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాను. మాకు ఆదివారం అంటే మంచి ఆనందాన్ని పంచే చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం వుంటుంది.



మిగిలిన సెలవు రోజులు అంతగా పట్టింపు లేదు. ఆదివారం అనుబంధాల్లో వచ్చే ప్రత్యేక వ్యాసాల గురించి, వివిధ ఛానళ్ళు, పేపర్లలో వచ్చే వార్తల గురించి మేం చర్చించుకుంటాం. మెదడుకు మేతపెట్టే పజిల్‌ని పూర్తిచేస్తాం. టివిల్లో వచ్చే మంచి విజ్ఞానదాయకమైన కార్యక్రమాలు చూస్తాం. అందరికి ఇష్టమైన వంటలు చేసుకొని తింటాం. ఇష్టమైన పాత సినిమాల్లోని మధురగీతాల్ని డివిడిలో వేసుకొని చూస్తాం.

- సేరి కొండలరావు,
తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా


## మనసుకు నచ్చిన రోజు



ఆదివారం చాలా ఇష్టమయిన రోజు. లేస్తూనే హాయిగా ఫీలవుతాను. ఉదయం ఆరాధన కార్యక్రమాలు చూస్తూ ఫిల్టర్ కాఫీ తాగడం ఒక మధురానుభూతి. ఇంట్లో కార్యక్రమాలన్నీ అయిన తర్వాత టివి చూస్తూ అందరం కూర్చుని భోజనం చేయటం ఒక ఆనందం. మధ్యాహ్నం ఒక గంట విశ్రాంతి తీసుకుని కుటుంబ సభ్యులం అందరి కలిసి స్నేహితుల ఇంటికో, బంధువుల ఇంటికో, దేవాలయానికో వెళ్ళి వచ్చి డిన్నర్ చేయడం ప్రతి ఆదివారం చేసే పని. ఇరుగుపొరుగు వారితో కలిసిమెలిసి ఉండటం, శక్తివంచన లేకుండా నాకు తోచిన సహాయం చేయడం అన్నిటికన్నా నాకిష్టమయిన పని. ఇంటి ఆవర ణలో అనేకరకాల పూలమొక్కలు ఉన్నాయి. తోటపని అంటే చాలా ఇష్టం. అది నా మనసుకెంతో ప్రశాంతతనిస్తుంది.

- కూచిమంచి నాగలక్ష్మి, హైదరాబాద్

## మానసిక ప్రశాంతతకు ఆధ్యాత్మికం



నేను వ్యాపారం చేస్తుంటాను. ఆదివారం నాకు ఆనందమైన రోజు. ఆదివారం వచ్చిందంటే చాలు హిస్టారికల్ ప్లేస్‌లు చూడటం అలవాటు. అంతేకాకుండా లైబ్రరీకి వెళ్ళి ఆధ్యాత్మిక పుస్తకాలు చదవటం నా హాబీ. వీలుదొరికినప్పుడు మా బజారులోని చిన్న పిల్లల చేత ఆడటలాడిస్తాను. వారు పొందే ఆనందం నాకు ఎంతో హాయినిస్తుంది. అప్పు డప్పుడు మాకు దగ్గరలోవున్న నాగార్జునసాగర్ చూడటానికి స్నేహి తులతో వెళుతుంటాను. ఆ సమయంలో ఏదో చేయాలనీ ఆలోచన. అందుకే నాకు తెలిసిన ప్రతిఒక్కరికి ఆధ్యాత్మిక విషయాలు చెబుతుంటాను. ఒత్తిడుల నుంచి తప్పుకునే సరైన మార్గం ఆధ్యాత్మికత అని నా ఉద్దేశం.

- కె.చెన్నకేశవులు, గారెడ్డిపల్లి, మహబూబ్‌నగర్ జిల్లా